'స్వాతి' మాసపత్రిక - డిసెంబర్, 1984

# నెత్తి మీద దేవత

వీధిలో మంచం వేసుకున్నాడు జోగారావు.

ఇంట్లోకి గాలి రాదు. వెలుగు రాదు. అసలే ఎండాకాలం. రాత్రి ఎనిమిదయినా ఇంకా వేడి గాడ్పులు!

లారీ వీధిలోంచి గట్టుకేసి పోతూ ఇంత దుమ్ము రేపి జోగారావు ముఖాన కొట్టింది.

జోగారావుకి చిర్రెక్కి లారీని బండబూతులు తిట్టేడు. పక్కమీంచి లేచేడు. పక్క దులుపుకున్నాడు. ఒళ్ళు దులుపుకున్నాడు.

తలగడ కింద సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె తీసేడు.

అగ్గిపెట్టెలో పుల్లలున్నాయిగాని, సిగరెట్ పెట్టెలో సిగరెట్లు లేవు.

అంతే! సిగరెట్ పెట్టె కూడా పచ్చి బూతులు తిని, నాలుగు ముక్కలయి కాలవలోకి విసిరేయబడింది.

జోగారావు వయసు ముప్పయి మూడేళ్ళు. మనిషి పొట్టిగా, సన్నంగా వుంటాడు. భార్య, ముగ్గురు పిల్లలున్నారు. పేపరు మిల్లులో అరొందలు జీతమొచ్చే వుద్యోగముంది. ఎలాంటిదైతేనేం – సొంతానికంటూ ఒక చిన్న ఇల్లు వుంది. ఇంతకన్నా చెప్పుకోదగ్గవి అతని గురించి ఏమీ లేవంటే అది పెద్ద పొరపాటే అవుతుంది.

ఎంచేతనగా – అతని ఇంట్లో గోడకి వేలాడుతున్న ఫొటో చూడుడు. అప్పుడు జోగారావు గొప్పతనం తెలియును!

ఆ గదిలో వున్న పట్టె మంచమూ, బీరువా, మైల బట్టల బుట్టా, ట్యూబులైటు, మురికి పట్టిన టేబుల్‌పై మాసిన టేబుల్ క్లాతు, దాని పైనున్న పలకని రేడియో, పెళ్ళి ఫొటోలో తనూ, భార్యా... చివరికి గోడకి వెలాడుతున్న ఏడుకొండలవాడి కేలండరు కూడా ఆ ఫొటో ముందు దిగదుడుపే.

ఆ గదిలో కిటికీ అంత సైజు వున్న ఆ ఫొటో ముందు ఏదైనా సరే అది కళావిహీన మైనది. అర్థరహితమైనది. ఏ మాత్రం విలువ లేనిది. వెలవెలపోక తప్పనిది.

ఆ ఫొటోలో వున్న వ్యక్తి పేరు మునిస్వామి.

మునిస్వామి అతనికి మేనమామ! మునిస్వామి అతనికి స్వయాన మావయ్య కావడం జోగారావు కెంతో గర్వకారణం. గొప్ప విషయం. ఏ జన్మలోనో చేసిన పుణ్యఫలంగా భావిస్తాడు జోగారావు.

పట్ట బుర్ర, చిన్ని కళ్ళు, ఎర్రటి బొట్టు, పెద్ద మీసాలు... బ్రహ్మతేజస్సుతో, రాజఠీవితో వెలిగిపోతోంది ఫోటోలో మావయ్య ముఖం!

మావయ్య మునిస్వామికి పెద్ద కలప వ్యాపారముంది. రెండు సినిమా హాల్లున్నాయి. పేపరు మిల్లులోపెద్ద కాంట్రాక్టు వుంది. ఆ వార్డుకి కౌన్సిలర్ గిరి వుంది. మూడు భవంతులూ, బోల్డు జాగా వుంది. అమలాపురంలో బోల్డు భూమి వుంది. బంగారం లాంటి కొబ్బరి తోట వుంది.

అంత గొప్పవాడైన మునిస్వామి జోగారావుకి మేనమామ అయినప్పుడు మునిస్వామి ఫొటో ఆ యింట్లో లేకుండా ఎలా వుంటుంది?

సిగరెట్లు కొనుక్కోడానికి మంచం మీంచి లేచేడు జోగారావు.

అతని వంటి మీద బనీను – ఫర్లేదు తెల్లగానే వుంది. జబ్బపై పది పైసలంత చిరుగుంది. భుజంపై తువ్వాలు వేసుకుని చిరుగు కప్పేడు. హవాయ్ స్లిప్పర్లు వేసుకున్నాడు.

సిగరెట్లు కొనడానికి డబ్బుల్లేవు అతని దగ్గర. నెలాఖరు రోజులు. జీతాలకి మరో వారం వుంది. రేపో పది రూపాయలు అప్పిస్తానని వొక ఫ్రెండు వాగ్దానం చేసేడు.

వీధికి ఎగువనున్న నర్సమ్మ కొట్టుకి వెళ్ళేడు జోగారావు.

నర్సమ్మ రెండు నెలలుగా జోగారావుని బ్రతిమాలుతోంది. మీ మావయ్యతో చెప్పి లోను ఇప్పించే ఏర్పాటు చేయమంటోంది. లోనుతో బడ్డీని డెవలప్ చేస్తానంటోంది.

అలాగే - అదెంతలో పని - చీటికెలో లోను ఇప్పించేస్తానన్నాడు.

ఇప్పుడూ అదేమాట అన్నాడు. అంటూ ఒక 'చార్మినార్ పెట్టొకటి పడేయ్' అని కలిపేడు.

గత పదేళ్ళుగా కొట్టు నడుపుతున్న నర్సమ్మ తెలివి తక్కువదెలా అవుతుంది? జోగారావు వచ్చింది సిగరెట్లు అరువు తీసుకెళ్ళడానికని తెలుసు. డబ్బులు జీతాలకి ఖచ్చితంగా ఇచ్చేస్తాడని కూడా తెలుసు. లోను ఇప్పించగలడనే నమ్మకం ఆమెకి సడలుతున్నప్పటికీ - అతనికి లోను సంగతి గుర్తు చేసి "ఈ పేద్దానికామాత్రం సాయం చేసి పుణ్యం కట్టుకో బాబు" అంటుంది.

పుణ్యం కట్టుకోడానికి జోగారావు ఒప్పుకొని - సిగరెట్ పెట్టెతో అక్కడ నుంచి బయట పడ్డాడు.

తోవలో బొక్కల బనీను జోగారావు ఒక ఆస్థిపంజరాన్ని ఢీకొన్నాడు. ఢీ కొట్టి "ఏం బావా సంగతులేవిఁటి?" అన్నాడు.

ఆస్థిపంజరానికి గురుమూర్తి అనే పేరుంది. రైల్వే లోకోషెడ్‌లో ఫిట్టరు ఉద్యోగం వుంది. సొంత ఇల్లు వుంది. గయ్యాళి పెళ్ళాం వుంది. పెళ్ళికెదిగిన పిల్ల వుంది. ఆ పిల్ల కాక ఇంకా ముగ్గురు పిల్లలున్నారు. అతనికింకా ఏడేళ్ళ సర్వీసు కూడా వుంది. కాని అతన్ని చూసి ఎవరూ అలా అనుకోరు. నమ్మరు. రేపో, మాపో రిటైరయిపోయేటంత వార్ధక్యంతో కన్పిస్తాడు. అతను జోగారావుకి బంధువు.

"ఏం బావా - ఏం సంగతు" లంటే - "ఏమున్నాయి మామూలే" అన్నాడు గురుమూర్తి.

"ఎక్కడ నుంచి వస్తున్నావ్?"

"ఇంకెక్కడ నుంచి! మీ మామయ్య దగ్గర నుంచేనోయ్!"

మామయ్య దగ్గరికి గురుమూర్తి ఎందుకు వెళ్ళిందీ జోగారావుకి తెలుసు. ఈ రోజే కాదు - గత రెండు నెలలుగా తిరుగుతున్న సంగతి కూడా తెలుసు!

గురుమూర్తి పెద్ద కూతురు పద్మ! చాలా మంచి పిల్ల. అందంగా ఉంటుంది. ఏ విషయాన్నైనా తర్కించి, బాగా ఆలోచించగల పిల్ల. చదువు ఇంటర్‌తో ఆగిపోయినా - ప్రపంచాన్ని బాగా చదివింది.

పద్మకి పెళ్ళి సంబంధం వచ్చింది. ఆ సంబంధం ఇరువైపుల వారికీ ఎంచక్కా నచ్చింది. నచ్చినంతలో తాళి కట్టేస్తే చిక్కేలేదు.

చిక్కల్లా కట్నం దగ్గర వచ్చింది.

కట్నం పది వేలు!

నిజానికి ఆ కుర్రాడికి మార్కెట్లో ముప్పయి వేలు పలుకుతోందట రేటు. అమ్మాయి చాలా బాగుండడం చేత - బంపర్ రిబేటు! కేవలం పది వేలు కట్నం చాలట! పెళ్ళి

మటుకు వేగంగా, ఎంత వీలైతే అంత తొందరగా అయిపోవాలని గట్టి షరతు!

తొందరగా పది వేలు కాదు,పది వందలు కూడా తేలేని స్థితి గురుమూర్తిది. కుర్రవాడు మంచి ఉద్యోగం చేస్తున్నాడు. బుద్ధిమంతుడిలా తోస్తున్నాడు. కట్నం, కారు చౌకబేరమూ! ఏ విధంగా చూసినా సంబంధం వదుల్కోవాలనిలేదు గురుమూర్తికి!

పెళ్ళిచూపుల తంతు దగ్గర జోగారావు కూడా వున్నాడు.

ఇద్దరూ చాలా సేపు ఆ విషయమై చర్చించడం జరిగింది.

"పద్మ అదృష్ట జాతకురాలు. మంచి సంబంధం. వెధవ పది వేల కోసం చూడకు" అన్నాడు జోగారావు.

"అదికాదువోయ్! అంత డబ్బు ఎక్కడ నుంచి తేగల్ను? అన్ని లోన్లూ తీసేసాను. అంత అప్పు పుడుతుందని నమ్మకమూ లేదు."

"మామయ్యనడిగితే తప్పక సర్దుతాడు" అని సలహా ఇచ్చేడు జోగారావు.

గురుమూర్తికి ఆ సలహా నచ్చింది.

ఈ సంబంధం మునిస్వామిగారు దయతో చూపించిందే. ఈ రోజు ఇక్కడికి తప్పక వచ్చేవారే. ఏదో అర్జంటు పని తగిలి వుండిపోయేరు. విషయం అర్థం చేసుకుని ఓ పది వేలు సాయం చేయక పోరు - అనుకున్నాడు గురుమూర్తి.

"తప్పక మామయ్య సాయం చేస్తాడు" అన్నాడు జోగారావు.

ఇద్దరూ ఆ రోజే మునిస్వామిగారింటికి వెళ్ళేరు. వారు అప్పుడు ఇంట్లో లేరు. వారు వచ్చేవరకూ ఎదురు చూసేరు.

రాత్రి తొమ్మిది ప్రాంతంలో వచ్చేరు మునిస్వామిగారు. వచ్చి, విషయం, చెప్పిందంతా విన్నారు.

"పది వేల కోసం ఆలోచిస్తే ఎలాగయ్యా - రత్నం,లాంటి సంబంధం. అందుకే వాళ్ళని నేను పంపేను" అన్నాడు మునిస్వామి.

ఆ సంబంధం పంపిన మునిస్వామిగారికి గురుమూర్తి వినయంగా కృతజ్ఞతలు తెలియజేసి ఆ చేతులతోటే కట్నం పది వేలు సర్ది పెళ్ళి జరిగేలా చూడమని ప్రార్థించేడు.

"సరే" అంటూ మునుస్వామి ఒప్పుకున్నాడు.

ఒప్పుకోగానే గురుమూర్తి ముఖం వెలిగిపోయింది.

జోగారావు గురుమూర్తి ముఖంలో వెలుగు చూడలేదు. మామయ్యలో మంచితనం చూసేడు.

వచ్చే ఆదివారమే ఇస్తానన్నాడు డబ్బు మునుస్వామి.

ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఇస్తానన్న డబ్బు కోసం తిరుగుతూనే వున్నాడు గురుమూర్తి.

వెంటనే డబ్బు సర్దడానికి వీలు కాలేదట మునిస్వామికి. ఆ నెలే కలప వ్యాపారం

దెబ్బతిందట. మొన్న మొన్నే అతని మూడో కూతురికి పెద్ద ఎత్తున పెళ్ళి జరిపించేడు. పెళ్ళికి హైద్రాబాద్ నుంచి మంత్రి కూడా వచ్చేరు. కట్నం మూడు లక్షలు ఇచ్చి, లక్ష రూపాయల ఖర్చుతో మహావైభవంగా, అతి ఘనంగా వివాహం జరిపించేడట. ఇంత ఖర్చు వల్ల గురుమూర్తికి వెంటనే పది వేలు సర్దలేకపోయేడట!

తర్వాత కొన్ని అర్జంటు పనులు తగలడం చేత – ఆ వత్తిడిలో అప్పు ఇస్తానన్న సంగతి మర్చిపోయేడట!

మర్చిపోయినందుకు మునిస్వామి బాధపడ్డాడు ఈ రోజు!

"రేపురా గురుమూర్తి – తప్పక ఇస్తాను సాయంత్రం చేసిరా" అని ప్రామిస్ చేసేడు.

రెండు చేతులూ జోడించి సెలవు పుచ్చుకు వచ్చేసాడు గురుమూర్తి. ఇప్పుడు ఆ సంగతే చెప్పేడు గురుమూర్తి జోగారావుతో.

"ఒకరోజు అటూ, ఇటూ గాని – ఇస్తానన్నాడంటే తప్పక ఇస్తాడు మావయ్య. ఏదోలా ఆ శుభకార్యమేదో తొందరగా జరిగిపోతే చాలు" అన్నాడు జోగారావు.

"మీ అందరి దయ వుంటే" అన్నాడు గురుమూర్తి. "పెళ్ళికి మీ మామయ్య ఎన్ని పనులున్నా వీలుచూసుకు వస్తానన్నాడు. వస్తారంటే ఎంతో ఆనందంగా వుందిగాని కార్యం జరిగేవరకూ భయం, భయంగా వుందోయ్" అన్నాడు గురుమూర్తి.

అవతల మగపెళ్ళివారి ఒత్తిడి చేత, ముహూర్తం సమీపించడం చేత, కట్నం దొరుకుతుందనే ధీమా చేత, మిగతా ఏర్పాట్లన్నీ కొంతలో కొంత సాగుతున్నాయి. వెడ్డింగ్ కార్డులు కూడా ప్రింటింగ్‌కి ఇచ్చివేయడం జరిగింది. వెడ్డింగ్ కార్డుల దిగువున – 'మునిస్వామి, మున్సిపల్ కౌన్సిలర్ అభినందనలతో అని మర్చిపోకుండా చేర్చేడు. ఆ సలహా జోగారావుదే!

ఆ వీధిలో అవతల సందులో జోగారావు ఇల్లయితే ఇవతల సందులో గురుమూర్తి ఇల్లు. వీరిద్దరి మధ్య కొంతలో కొంత బంధుత్వం వుంది. అంటే మునిస్వామితో కూడా వున్నట్టు లెక్క! పద్మ తరచుగా జోగారావు ఇంటికి వస్తుంది. జోగారావుని 'మామయ్య, మామయ్య' అంటూ ఎన్నో కబుర్లు చెబుతుంది. దేశంలో రాజకీయాలు ముచ్చటిస్తుంది. జీవిత సత్యాలు ఎన్నో మాట్లాడుతుంది. పద్మంటే జోగారావుకి ఇష్టం. ఆ మధ్య ఒకసారి తన భార్య జబ్బుపడి ఆసుపత్రిలో జాయినైతే నెల రోజులు అక్కడే వుండి సేవ చేసింది.

"వస్తానోయ్" అంటూ గురుమూర్తి వెళ్ళిపోయేడు.

జోగారావు మంచంపై నడుం వాల్చేడు. తను పడుకున్న మంచం బ్రిడ్జిలానూ, మంచం కింద కుళ్లి కాలవ గోదావరిలానూ పోల్చడానికి వీలులేదు. ఏమంటే గోదావరి ఎండా కాలంలో కొంతలో కొంత ఎండిపోతుంది. ఈ కాలవ ఏ కాలంలోనూ ఏ మాత్రం ఎండిపోదు. ప్రవహించదు. విపరీతమైన కంపు కొడుతుంది. ఆ కంపు జోగారావుకి అలవాటైపోయింది.

మామయ్యని గురుమూర్తి ఎలా నెమ్మదిగా బుట్టలో వేసుకున్నదీ... అంతా తను గమనిస్తూనే వున్నాడు.

మావయ్య ఇంటికి గురుమూర్తి తిరగని రోజంటూ లేదు. ప్రతి రోజు డబ్బు అడిగి విసుగు కలిగించకుండా అలా కనిపించి మాత్రమే వచ్చేసేవాడు. అతని అదృష్టం కొలదీ – మావయ్యని గాలం వేయడానికి మంచి అవకాశం దొరికింది – అది మావయ్య కూతురి పెళ్ళి! పెళ్ళికి ముందు పది రోజులూ, తర్వాత మూడు రోజులూ బాగా కష్టపడ్డాడు. నిజానికి చెప్పాలంటే అలాగ తనే కాదు – ఎవరూ కష్టపడలేదు. చేసిన కష్టం మావయ్య చూడాలి, మెచ్చుకోవాలి అని కాకుండా ఒళ్ళు దాచుకోకుండా విశ్వాసంగా చేసేడు. రేయింబవళ్ళు కష్టపడ్డాడు.

ఇంత చాకిరీ గురుమూర్తి చేసేడా? లేదు... పది వేల అవసరం చేయించింది చాకిరీ!

– జోగారావు ఆలోచనలు గురుమూర్తిపై దాడి చేస్తే – దోమలు జోగారావుపై దాడి చేస్తున్నాయి!

✿ ✿ ✿

ఉదయం లేటుగా నిద్ర లేచేడు జోగారావు. నిద్ర లేచి చెంబు పట్టుకుని గట్టుకి వెళ్ళిన తనని, మరో చెంబు చిన్నారావు పలకరించాడు. పలకరించి –

"గురుమూర్తికి కోర్టు సమన్లు వచ్చేయి తెల్సా?" – చెంబు చిన్నారావుది గురుమూర్తి పక్క ఇల్లు!

జోగారావు ఆశ్చర్యపోయి 'ఎప్పుడు?' అనడిగేడు.

"ఇప్పుడే"

"ఎందుకూ?"

"అయ్యో రామా! నిజంగా నీకు తెలీదన్నమాట. ఇంటి మీద దావా వేసేడండీ సుబ్బారావు! అతనెవరో మీకు తెలీదా! నాకు తెల్సు! సుబ్బారావు దగ్గర నాలుగు వేలు అప్పు మీవాడు తీసుకుని ఎంచెక్కా ఎగ్గొట్టేసాడటండీ బాబూ!"

"ఆహాఁ! గురుమూర్తి నాకెప్పుడూ చెప్పలేదండీ!"

"నే చెబ్తున్నా గదూ! మీ వాడు నెంబరు వన్‌గా అప్పులు చేస్తాడు. ఒకసారి అతను డ్యూటీచేసే దగ్గరికి వెళ్ళి వాకబు చేయండి. అతను ఎంతెంతమంది దగ్గర ఎన్నెన్ని అప్పులు చేసాడో తెలుస్తుంది".

ఏవో చిన్న చిన్న అప్పులు వుంటాయనుకున్నాడుగాని, ఇంత ఘోరంగా అందరి దగ్గరా అప్పులు చేసి వుంటాడనుకోలేదు.

"గురుమూర్తి సుబ్బారావుకి కొన్నాళ్ళ వరకూ వడ్డీ కట్టి మరిక వడ్డీ కట్టడం మానేసాడట! అదిగో, ఇదిగో అంటూ నాలుగైదు నెలలు దాటేయగానే సుబ్రావు ఒకసారి గట్టిగా నిలదీసి అడిగితే నల్గురిలో సుబ్బారావుని ఎంతో అవమానం చేసాడట!

"సుబ్బారావుని ఎంతెంత మాటలన్నాడట తెల్సా? 'నీయమ్మ! నా జీతం అంతా నీకు వడ్డీ కింద కట్టేస్తే మేం ఏం తిని బతకమంటావురా' అన్నాడట! 'ఇన్నాళ్ళు కట్టిన వడ్డీకి

ఏనాడో అసలు చెల్లిపోయింది. కట్టేది లేదు ఫో' అన్నాడట! అంతేకాదు చాలా అసహ్యంగా పేలేడట! 'ఒరే నీ వేసుకున్న చొక్కా ఎక్కడిది? నా వడ్డీ డబ్బు లేరా' అన్నాడట! 'నీ పెళ్ళం కట్టిన చీర నా వడ్డీతోనే' అన్నాడట! 'నీవు కట్టిన ఇల్లు ఇటుకతో కాదు. నా వడ్డీ డబ్బుల్తో' అన్నాడట. 'ఒరే నీ పిల్లలకి పట్టిన పాలు కూడా నా వడ్డీ డబ్బులేరా' అన్నాడట! 'నీకు పైసా ఇచ్చేది లేదు – ఏం చేస్కుంటావో చెస్కోఫో' అన్నాడట!

"అలా అనేటప్పటికి సుబ్బారావు చెమటలు కక్కేసాడట! గజగజలాడిపోయేడట! నోట మాట రాలేదట! మరుసటి రోజే ప్లీడర్ని సంప్రదించి పాపం నాలుగు వేలు పంచభూతాల్లో కలిసిపోకుండా, ఇంటి మీద దావా పడేసాడు. ఏం చేస్తాడు మరి!"

చెంబు చిన్నారావు చెప్పిందంతా విన్నాడు జోగారావు. విని చాలా సేపు అక్కడే అలా చెంబుతో వుండిపోయేడు.

తర్వాత –

గభాల్న లేచి కాలకృత్యాలన్నీ వేగిరం ముగించుకుని బట్టలు వేసుకుని బయటకు పరిగెట్టేడు జోగారావు. ఎవరో తరుముతున్నట్టుగా వుంది ఆ పరుగు!

ఎక్కడికా పరుగు?

గురుమూర్తి ఇంటికా?

కాదు, మునిస్వామి భవంతికి!

❁ ❁ ❁

పరుగుబెట్టి మునిస్వామి భవంతి చేరేటప్పటికి పూర్తిగా నీరసం, ఆయాసం వచ్చేసింది జోగారావుకి. దప్పికతో నాలుక పిడచకట్టుకుపోతోంది.

తన పదేళ్ళ కూతురికి జీతాలప్పుడు ఇచ్చిన ఒక రూపాయిలో ఇప్పటికీ ఒక పావలా దాచుకుంటే మళ్ళీ జీతాలకి పావలాకి మరో పావలా వడ్డీ వేసి ఇస్తానని హామీ ఇచ్చి – పాప కంపాక్స్‌బాక్స్‌లోని ఆ పావలాతో బయటపడి – పావలా దూరం బస్సెక్కి – మరో పావలా దూరం నడిచి, భవంతికి – చేరుకునేసరికి అప్పుడే కారులో ఎక్కడికో వెళ్ళిపోతున్నాడు మావయ్య!

అసలు జోగారావు వెళ్ళీవెళ్ళగానే మావయ్యని చూడ్డం కాదు ముందు మూడు గ్లాసులు మంచినీళ్ళు చల్లనివి తాగుదామనుకున్నాడు. కాని ఎదురుగా మావయ్య కారు!

మంచినీళ్ళ కన్నా ఇప్పుడు మామయ్య ముఖ్యం.

జోగారావు కారుకి అడ్డంగా వచ్చి చేయి ఊపేడు. కారు ఆపకపోతే మలుపు తిరిగీ తిరగ్గానే అగాధంలోకి పడిపోవటం ఖాయం అన్నట్టు!

ఎదుటి వారి ముఖాలు చదవడంలో మునిస్వామి తర్వాతే మరెవరైనా.

కారు ఆగింది.

"ఏరా" అన్నాడు మునిస్వామి.

"మీతో ముఖ్యమైన విషయం చెప్పాలని వచ్చానండీ" అన్నాడు వినయంగా జోగారావు.

మునిస్వామి తనకి మేనమామ అని అందరికీ చెప్పడం చెబుతున్నాడు గాని నోరారా 'మామయ్య' అనలేకపోతున్నాడు. అలా పిలవాలంటే నోట్లో ఏదో అడ్డుపడ్డట్లుగా వుంటోంది. మొట్టమొదట్లో, తన చిన్నతనంలో నిస్సంకోచంగా, నిర్భయంగా పిలిచేవాడు. అప్పటికి మావయ్య అంతగా ఎదగలేదు. పెరగలేదు. క్రమక్రమేణా మావయ్య ఎత్తుకి, అందుకోలేని ఎత్తుకి, మెడ ఎత్తి చూడలేని ఎత్తుకి ఎదిగిపోయేడు. తను చూస్తూండగానే పెరిగిపోయేడు.

ఆ స్థితిలో మావయ్యని మావయ్య అని పిలవడానికి బెరుగ్గాను, భయంగాను, అదోలానూ వుండేది. తనలా పిలిస్తే మావయ్య చిరాకు పడినట్టుగాను, వినిపించుకోనట్టు గాను వుండేవాడు. తనకి తెలీకుండానే మావయ్య అనే పదం "అండీ"గా రూపుదాల్చింది. "అండీ" అని పిలవడం మావయ్య ఆనందంగా ఇష్టపడుతున్నట్టు తోచి, మావయ్య ఆనందమే తన ఆనందంగా భావించేడు.

తనను ఎవరికీ మేనల్లుడని పరిచయం చేయడం లేనప్పటికీ – పేపరు మిల్లులో ఉద్యోగం వేయించాడన్నా, పెళ్ళి జరిపించి ఒక ఇంటివాడిగా చేసేడన్నా అదంతా నిజంగా మావయ్య చలవే.

జోగారావు చెప్పబోయే ముఖ్యమైన విషయం, కారు ఆపి, వినేటంత టైము లేదు మునిస్వామికి.

"కారెక్కు" అన్నాడు మునిస్వామి.

నిప్పులోకి దూకు, నూతిలో గెంతు అన్నా అందుకు సిద్ధమే జోగారావు.

కారెక్కాడు జోగారావు.

కారు మలుపు తిరిగి స్పీడునందుకుంది

"ఏట్రా అంత ముఖ్యమైన సంగతి" ఎటో చూస్తు అడిగేడు జోగారావు.

"మరేం లేదు... మీరు ఈ రోజు గురుమూర్తికి పది వేలు అప్పు ఇస్తామన్నారటగా"

"ఊఁ"

"ఇవ్వకండి, కొంపలు మునుగుతాయి"

ఛప్న జోగారావు ముఖంలోకి చూసేడు మునిస్వామి – కనుబొమ్మలు ముడివేస్తూ.

జోగారావు వుదయం జరిగిన సంగతంతా పూసగుచ్చినట్టు చెప్పేడు. పోలీసులు రావడం, గురుమూర్తిని తీసుకెళ్ళడం, ఆ మూడు వేల అప్పేగాక, ఇంకా చాలా అప్పులున్నాయనీ, అవన్నీ ఇపుడిపుడే బయటపడుతున్నాయనీ చెప్పేడు.

గురుమూర్తి అప్పులు తీర్చేరకం కాదని ఉన్న ఆ ఒక్క కొంప మీదే అందరికీ బోల్తా కొట్టించి అప్పులు చేస్తున్నాడనీ, ఈ స్థితిలో పది వేలు మీరు యిస్తే ఇంతే సంగతులనీ చెప్పేడు.

మునిస్వామి అతను చెప్పిందంతా విన్నాడు. ఒక దీర్ఘ నిట్టూర్పు విడిచేడు.

కారు ఆపు చేయించేడు.

"మరిక నీవెళ్ళు, నాకు పనుంది" అని కిందకి దింపేసాడు.

మరుక్షణం కారు ఇంత దుమ్ము జోగారావుకి తోడుగా వదిలేసి తుర్రుమంది.

అతనికి దుమ్మూ, ధూళీ తప్ప మావయ్య, మావయ్య కారు కనిపించలేదు.

పాతేసినట్టు అలా నించుండి పోయేడు జోగారావు.

అతని నెత్తిపై ఫటేలున మండుటెండ కొడ్తోంది. వేడి గాల్పులు.

గొంతు ఎండిపోతోంది. దాహం దాహం.

ఇక్కడ నుంచి నాలుగు మైళ్ళు నడిస్తేగాని ఇల్లు చేరలేడు.

మావయ్యకి నిముషాలు ఎంత విలువైనవి అయినప్పటికి, ఎంతెంత అర్జంటు పనులపై వెళుతున్నప్పటికీ, తననిలా యింటికి మరింత దూరంలో వదిలేసి వెళిపోవడం – ఏదో గుండెల్లో గుచ్చుకున్నట్టుగా వుంది.

పది వేల రూపాయలు మట్టి కలిసిపోకుండా ఇన్ఫర్మేషన్ ఇచ్చిన బంధువు పట్ల ఇదా మావయ్య రెస్పాన్సు? ఇదా మర్యాద? గుండెల్ని నొక్కేసినట్టు బాధ!

తన దగ్గర బస్సెక్కి వెళ్ళడానికి ఓ అర్ధరూపాయిగాని, కనీసం సోడా తాగి నడవడానికి పదిహేను పైసలుగాని లేవని – కారులో వెళుతున్న మావయ్య గ్రహించలేడు అడిగితే ఇవ్వకపోడు డబ్బులు. కాని జోగారావుకి అభిమానం!

ఇంటికి ఎలా వెళ్ళాలో తల్చుకుంటే ఏడుపొస్తోంది జోగారావుకి.

అతని మనసెందుకో బాగా లేదు.

❁ ❁ ❁

రాత్రి పదవుతోంది.

ఊరంతా నిద్రలో కొరిగిపోతోంది. వెన్నెల కాయడం మరిచి చందమామ నల్లమబ్బుల మీద నిద్ర పోతోంది. గాలి కోడి కునుకు తీస్తోంది. కుళ్ళు కాలవ నిశ్చింతగా నిద్ర పోతోంది. కుక్కలు రెండు నడివీధిలో అడ్డంగా, వెల్లికిలా పడుకుని నిద్ర పోతున్నాయి.

జోగారావు నిద్ర పోవాలని ప్రయత్నిస్తున్నాడే గాని నిద్ర పట్టడం లేదు.

తను మధ్యాహ్నం తిన్న వడదెబ్బ నుంచి ఇంకా తేరుకోలేదు. తలంతా విపరీతమైన నొప్పిగాను, వొళ్ళంతా, పచ్చిపుండుగానూ వుంది. కాళ్ళు, చేతులూ లాగేస్తున్నాయి.

మంచంపై అటూ, ఇటూ దొర్లుతూ... తన వైపు ఎవరో రావటం చూసేడు. చప్పుడికి లేచిన కుక్క – వీడెవడో కొత్తమనిషి లాగున్నాడని – ఎందుకైనా మంచిదని భౌభౌ మని అరిచేసి వెంటనే నాలిక కరుచుకుంది!

అతను వీధిలో ఎప్పుడూ నడిచే మనిషే! అతను గురుమూర్తి అని గుర్తించింది.

అనవసరంగా, అన్యాయంగా అరిచిన కుక్కని గురుమూర్తి వదిలేయలేదు. తీసి పెట్టి కాలుతో తన్నేడు.

కుయ్యో, మొర్రో అంటూ పారిపోయింది కుక్క.

అక్కడితో గురుమూర్తి కాలు విశ్రమించలేదు. కుక్కని తన్నిన కాలే జోగారావు మీదికి వెళ్లింది. అయితే - కుక్కని వొక్క తన్ను తన్ని వదిలేసినట్లుగా గురుమూర్తి జోగారావుని వదిలేయలేదు.

"అయ్యబాబోయ్! నా మొగుడు చచ్చిపోతున్నాడు బాబోయ్! ఈ వెధవ చచ్చినోడు చంపేస్తున్నాడు బాబోయ్" అని గుండెలు బాదుకుంటూ పెద్ద పెద్ద రాగాలు తీసింది జోగారావు ఇల్లాలు. నిద్రపోని వాళ్ళూ, నిద్రపోయిన వాళ్ళూ, అంతా వీధిలో వాళ్ళంతా క్షణాల్లో పోగయ్యేరు.

ఇరుగూ, పొరుగూ చేరేటప్పటికే గురుమూర్తి, జోగారావు మట్టిలో దొర్లి కొట్టేసుకుంటు న్నారు. దెబ్బలు బాగా జోగారావు తినేస్తున్నాడు. నిజానికి జోగారావు పెర్సనాలిటీ ముందు గురుమూర్తి నిలబడలేదు. తిరగబడితే మరిక మిగలడు. కాని జోగారావుకి అతన్ని ఎదుర్కొనే శక్తి, ధైర్యం రావడం లేదు. అస్థిపంజరంలా వున్న గురుమూర్తికి ఎక్కడలేని శక్తి! చంపేయాలన్నంత ధైర్యం!

వాళ్లిద్దర్నీ విడదీయడం జనాలకి బ్రహ్మప్రళయమైంది. జనం ఆపుతోంటే జోగారావు ఆగుతున్నాడు గాని గురుమూర్తి ఆగడం లేదు. నల్గురైదుగురు బలమైన యువకులు ఒక అస్థిపంజరాన్ని వెనక్కి లాగలేకపోతున్నారు. ఎలాగోలా అతణ్ణి ఆపగలిగినా అతని నోటి నుంచి వచ్చే పచ్చి బూతుల్ని ఆపలేకపోతున్నారు.

ఆ తిట్టుల్నీ, బూతుల్నీ ఆసక్తిగా వింటున్న జనం గురుమూర్తి ఏడుస్తున్నాడనేది గుర్తించి చలించిపోయేరు.

"ఈ లంజకొడుకు ఏం చేశాడో తెల్సాండీ. నేను రెండు నెలలుగా మునిస్వామి చుట్టూ దేక్రిదేక్రి, బకిరి, బకిరి, వంగి వంగి నమస్కారాలు చేసి, ఎంతో పడిగాపులు పడి, మరెంతో చాకిరీ చేసి - హమ్మయ్య! మరిక ఫర్వాలేదు, పది వేలు వచ్చేశాయి, పద్మ పెళ్ళి అయిపోతుందనుకున్న సమయానికి - ఈ బ్రోకరు లంజాకొడుకు వెళ్ళి వీడి అబ్బ సొమ్మేదో పోతున్నట్టు పనిగట్టుకు వెళ్ళి అప్పు ఇవ్వొద్దన్నాడు - అంతే! ఆ నా కొడుకు ఇవ్వడం మానేశాడు. ఎంత బతిమాలినా, ఎంత ప్రాధేయపడినా - చివరికి కాళ్ళు పట్టుకున్నా - 'ఇవ్వను ఫో' అనేశాడు వెధవనాకొడుకు. అసలు ఈ దొంగలంజాకొడుకు పని గట్టుకెళ్ళి నాకు అప్పు ఇవ్వొద్దని ఎందుకు చెప్పాలి? నా కూతురు పెళ్లి ఆపడానికెలా మనసొప్పింది? నా కూతురు వాడికేం అన్యాయం చేసింది? అది చేసిన తప్పల్లా మావయ్యా మావయ్యా అంటూ వాడి వెనకాతల తిరగడం. అది చేసిన తప్పల్లా వాడి పెళ్ళాం ముండ ఆసుపత్రిలో మండిపోతే నెల రోజులుగా సేవ చేయడం. నా కూతురు చేసిన తప్పదే!"

జరిగిందంతా విన్నాక ఎవరూ జోగారావు చేసిన పనిని హర్షించలేకపోయారు.

గురుమూర్తి శపథం చేశాడు.

"ముష్టి పది వేలు నీ మావం ఇవ్వనంత మాత్రాన, నీవు ఆపినంత మాత్రాన నా కూతురు పెళ్ళి ఆగిపోదు. ఆ ముహూర్తానికే నా ప్రాణాలైనా వొడ్డి నా కూతురి పెళ్ళి జరిపిస్తాను. జరిపించకపోతే నా పేరు గురుమూర్తి కాదు" అన్నాడు.

గురుమూర్తిని అందరూ అతడింటికి మోసుకుపోయినా - గురుమూర్తి అన్న మాటలు, తిట్లు జోగారావు చెవుల్లో గింగుర్లు పెడుతున్నాయి. ఊదరగొడ్తున్నాయి.

జోగారావు బుర్ర తిరిగిపోతోంది.

మామయ్యకి సమయానికి ఇన్ఫరమేషను ఇచ్చి పది వేలు కాపాడినందుకు కనీసం తన పేరుని బయటపెట్టకుండా వుండలేకపోయేడు మామయ్య!

చివరికిది తనపైకే తోసివేయబడుతుందని ఏ మాత్రం ఊహించని జోగారావు ఈ పరిణామానికి నిర్ఘాంతపోయేడు.

అతని మనసంతా అదోలా అయిపోయింది

❁ ❁ ❁

పద్మకి పెళ్ళి చేస్తానన్న ముహూర్తం రానే వచ్చింది.

గురుమూర్తి శపథం నెరవేరలేదు! పద్మకి పెళ్ళి కాలేదు!

అయితే - అదే ముహూర్తానికి - పద్మ మెడలో మూడు ముళ్ళు పడవల్సిన ముహూర్తానికి గురుమూర్తి మెడకి తాడు బిగుసుకుంది.

ఆత్మహత్య చేసుకున్నాడు గురుమూర్తి!

ఆ వార్త విని జోగారావు షాక్ తినేశాడు!

జోగారావు గురుమూర్తి శవాన్ని చూడ్డానికి గబగబా బయల్దేరాడు.

బయల్దేరినవాడు చూడ్డానికి వెళ్ళలేకపోయేడు! ఇంటి దగ్గర వుండలేకపోయేడు. దూరంగా ఎక్కడికో పోయి - ఆ రోజంతా గడిపి ఏ అర్థరాత్రో సైలంటుగా ఇంటికి చేరుకున్నాడు.

❁ ❁ ❁

ఒక తెల్లవారుజామున పద్మ ఇంట్లో కనిపించకపోవడంతో రాగాలూ, శోకాలూ, వెదకటాలూ ప్రారంభమయ్యేయి.

గురుమూర్తి చనిపోయి ఆర్నెల్లయినా కాలేదు. ఇంట్లో ఆ దుఃఖం నుంచి ఇంకా బయటపడనూ పడలేదు. అంతలోనే -

పిడుగు పడ్డ ఇంటి మీదే మళ్ళీ పిడుగు పడినట్టు పద్మ కనిపించకపోవడంతో ఆ ఇల్లు శోకంలో మునిగిపోయింది.

పద్మ ఏమయ్యిందీ?

లేచిపోయిందా?

చచ్చిపోయిందా?

జోగారావు కూడా నలుగురితోనూ ఆ యింటికి వెళ్ళి రెండు, మూడు రోజులు రాత్రనకా,

పగలనకా పద్మను వెదుకుతూ తిరిగేడు.

కనిపించలేదు.

అప్పుడే పోస్టుమాన్ తెచ్చిన ఉత్తరాన్ని జోగారావు భార్య అందుకుంది.

మంచంపై పడుకున్న జోగారావు కిచ్చింది.

ఉత్తరం విప్పి చూసి గభాల్న లేచి కూర్చున్నాడు.

"ఎవరండీ వుత్తరం రాసింది?"

"పద్మ.. మన పద్మ!"

"మన పద్మే!.. ఏవిఁటి రాసిందీ?"

"మావయ్యా- నేను క్షేమం. నా క్షేమసమాచారాలతో ఇంటికి ఉత్తరం వ్రాయడం పూర్తి చేసి - నీకు ప్రత్యేకంగా ఈ వుత్తరం వ్రాస్తున్నాను. నాలుగైదు రోజులుగా మిమ్మల్ని కంగారు పెట్టి వుంటాను. నేను ఏమైపోయానో అని మా ఇంట్లోవాళ్ళేగాక, నీవు, అత్తయ్య ఎంతో బాధపడి వుంటారని నాకు తెలుసు. అయితే ఎంత బంధువైనా మునిస్వామి మాత్రం బాధపడి వుండడని నేననుకుంటున్నాను.

నేనిప్పుడు హైదరాబాద్‌లో మా ఫ్రెండు దగ్గర వుంటున్నాను. రెండు, మూడు రోజుల్లో నేను ఒక ఉద్యోగస్తురాలిని కాబోతున్నాను. ఎవరికీ భారం కాకుండా నా బతుకు నేను బతకడానికి నిర్ణయించుకున్నాను.

నాకు ఒక్కటే దిగులు! పెళ్ళి కాలేదని కాదు. నా పెళ్ళి చేయలేక నాన్న చనిపోయేడని! నాన్న ఆత్మహత్య చేసుకున్న రోజున నీపై నాకెంతో కోపం వచ్చింది. నాన్నని చంపింది నీవే, నాన్నని హత్య చేసింది నీవే - అని ఏడ్చినట్టు కూడా గుర్తు. అపుడు నీవు ఎదురుగా వుంటే చంపేద్దునేమో కూడా!

ఇపుడదంతా గుర్తుకొచ్చి నవ్వు వస్తోంది. పది వేలు రానివ్వకుండా నా పెళ్ళి కానివ్వకుండా, నా తండ్రిని దక్కనీయకుండా చేసినందుకు నిన్ను చంపేయాలన్నంత కోపం, నేను చచ్చిపోవాలన్నంత దుఃఖం ఇపుడు నాలో లేవు. ఇపుడున్నది నీపై జాలి!

నిజం మావయ్యా! నీ ఉద్దేశం ఏవిటంటే నాన్న ఆ బాకీ తీర్చలేదని. అంతేకదూ! పోనీ తీర్చలేదనే అనుకుందాం. అంతలో మునిస్వామి బికారి అయిపోతాడా? చిప్ప పట్టుకుని వీధుల్లోకి పోయి అడుక్కు తింటాడా? పోనీ నీదీ మాలాగే జరగని కుటుంబం కదా. నీవు చేసిన అంత పెద్ద సాయానికి చిన్న పారితోషికమైన ఇచ్చాడా? లేదనే అనుకుంటున్నాను.

కాని ఇటువైపు!

ఇంటిపై పిడుగు పడింది. పెద్ద అల్లకల్లోలం రేగింది. ఇంటిల్లిపాది తల్లడిల్లిపోయేరు. ఇల్లంతా శోకసముద్రంలో మునిగిపోయింది. నా పెళ్ళి ఆగిపోయింది. నా తండ్రి ప్రాణాలు పోయేయి. ఇంట్లో ఏడుపులు తప్పా నిద్రా, తిండీ అనేవి కరువైనాయి.

మా నాన్న ఎన్నో అప్పులు చేసివుండొచ్చు. అవి సరదాకి చేయలేదు కదా. ఇల్లు గడవడానికే

చేశాడు. నీకు తెలీన్దేముంది? చిన్న చిన్న జీతగాళ్ళ బతుకే అంత! అందులో రోగాలు, పెళ్ళిళ్ళు పురుళ్ళు ఇలాంటివి తగిలితే ఇంక చెప్పేదేముంది? ఆ స్థితిలో జీవన వ్యయాన్ని మీటవడానికి జీతం సరిపోక పక్క మార్గాలు ఎన్నో వెతుక్కోవల్సి వస్తోంది అందులో అప్పు అనేది ఒకటి. అప్పు చేయకుండా ఎవరు వున్నారు చెప్పు? నీవు చేయడం లేదా?

మన బతుకులిలానే వుంటాయి. మునిస్వాములు మాత్రం మనలా వుండిపోరు. అదీ గమ్మత్తు. నీకు గుర్తుందా ధవిళేశ్వరం దగ్గర నీవు కొన్న స్థలం అత్తయ్య రోగం కోసం ముని స్వామికి అమ్మేసావు. మనవాడని చెప్పి రేటు తక్కువకైనా నువ్వే ఒప్పుకున్నావుగాని కష్టంలో ఉన్నావనిచెప్పి కనీసం మార్కెట్ రేటుకైనా ఇచ్చాడా మీ మామయ్య!

లిటిగేషనులో పడ్డ మా అమలాపురం భూములు చవగ్గా పడేసుకుని వాటినే ఇప్పుడు పదిరెట్లకైనా అమ్మను పొమ్మంటున్నాడు – అదీ అతనికీ మనకీ తేడా.

చెప్పుకోవాలంటే ఇలాంటివెన్నో

ఇంతకీ –

చిన్నదాన్నయినా – నేను చెప్పడానికి సాహసిస్తున్నదేమిటంటే పెద్దవాళ్ళని నీవేమీ రక్షించక్కర్లేదు. వాళ్ళని వాళ్ళు రక్షించుకోడానికి వాళ్ళకి బోలెడన్ని వనర్లున్నాయి. వాళ్ళని పెంచడానికే ఏర్పడ్డ ఈ వ్యవస్థ వాళ్ళ రక్షణకు చేయగల సదుపాయాలెన్నెన్నో చేసి పెడుతోంది. కాదంటావా మామయ్యా!

నీవు నాకు హాని చేసినా నేను నిన్ను మావయ్యా అనే పిలుస్తున్నాను. పిలుస్తాను. కాని నువ్వతనికెన్ని మేళ్ళు చేసినా మునిస్వామి నిన్ను మేనల్లుడా అనడు. నువ్వే అతన్ని మావయ్యా అనలేకపోతున్నావు! ఎందుచేతనేది గ్రహించలేవా?

ఇదంతా నా మనసు విప్పి చెప్పాలనే రాసేనుగాని నిన్ను బాధించాలని కాదు. వుంటాను. అత్తయ్యకి నమస్కారాలు. పిల్లలకి దీవెనలు.

ఇట్లు
మీ
పద్మ

❁ ❁ ❁

ఉద్యోగం చేస్తున్న పద్మ – అదే కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఒక యువకుణ్ణి వివాహం చేసుకోబోతోంది. ప్రేమ వివాహం – రిజిష్టర్డ్ మారేజీ.

ఆ సందర్భంగా వెడ్డింగ్ కార్డు ఇవ్వడానికి జోగారావు ఇంటికి వెళ్ళింది పద్మ.

వెళ్ళగానే – నవ్వుతూ ఆహ్వానించిన జోగారావు ఆమెకి కొత్తగా కనిపించేడు!

జోగారావే కాదు జోగారావు ఇల్లు కూడా కొత్తగా కనిపించింది!

గోడకి వేలాడుతూ – వచ్చేవాళ్ళకి ఎదురుగా నెత్తిమీద దేవతలా కనిపించే మునిస్వామి ఫొటో ఏమయ్యిందో – ఇప్పుడక్కడ కనిపించలేదు! ❁